

ఉపాధి వేతనదారులకు బీమా

- పీఎం సురక్ష, రాష్ట్రీయ స్వస్థ యోజనకు శ్రీకారం
- తక్కువ ప్రీమియంతో అధిక లబ్ధికి కృషి

● గత ఏడాది మెళియాపుట్టి మండలం గొప్పిలి గ్రామానికి చెందిన పొందర పార్వతి ఉపాధి పనులు చేస్తూ కుప్పకూలి మృతి చెందింది. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఉపాధి వేతనదారులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో పార్వతి కుటుంబానికి ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదు. కేంద్ర ప్రభుత్వం రూ.50వేలు మాత్రమే ఇచ్చింది. అదే ఇప్పుడు జరిగి ఉంటే ఆ కుటుంబానికి రూ.2 లక్షల వరకు బీమా వచ్చేది.

● ఈ నెల 22న మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన రాజపు గున్నమ్మ ఉపాధి పనులకు వెళ్లి మట్టి మోస్తుండగా పడిపోవడంతో చేయి విరిగిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఉపాధి వేతనదారులకు ప్రభుత్వం బీమా వర్తింపు చేస్తుండడంతో గున్నమ్మకు డబ్బులు వచ్చే అవకాశం ఉంది.



● ఈనెల 8న మెళియాపుట్టి మండలం పట్టుపురం గ్రామానికి చెందిన తులసమ్మ ఉపాధి పనులు చేస్తూ పడిపోవడంతో ఆమె చేయి విరిగిపోయింది. ప్రైవేట్ ఆసుపత్రిలో చేరడంతో వైద్యానికి సుమారు రూ.50 వేలు ఖర్చయింది. ప్రస్తుతం ప్రభుత్వం బీమా సదుపాయం కల్పించడంతో ఆమెకు డబ్బులు వచ్చే అవకాశం ఉంది.



● ఈ నెల 11న ఉపాధి పనులు చేస్తున్న నరసన్నపేట మండలం కోమర్తి గ్రామానికి చెందిన పి.తులసమ్మకు పాము కాటేసింది. ఆసుపత్రిలో చేరడంతో సుమారు రూ.30వేలు వరకు వైద్య ఖర్చులయ్యాయి. ఈమెకు బీమా లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందలేదు. దీంతో ఇబ్బందులు పడుతోంది.



చెరువు పనులు చేస్తున్న ఉపాధి హామీ వేతనదారులు

మెళియాపుట్టి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):

ఉపాధి హామీ పథకం వేతనదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత ప్రభుత్వం ఉపాధిహామీ వేతనదారులను వైఎస్ఆర్ బీమాలో చేర్చాలని ప్రయత్నించినా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. వేతనదారులు ప్రమాదాలకు గురైనా, పనిచేసే చోట ప్రాణాలు కోల్పోయినా పెద్దగా ఆర్థిక సాయం అందలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి వేతనదారులందరికీ బీమా సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. తక్కువ ప్రీమియంతో వారికి ఎక్కువ ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపడుతోంది. పీఎం సురక్ష, రాష్ట్రీయ స్వస్థ యోజనను వర్తింజేసేందుకు శ్రీకారం చుట్టింది. పీఎం సురక్ష బీమాలో చేరిన వేతనదారులు మృతిచెందితే రూ.2 లక్షలు, రాష్ట్రీయ స్వస్థ యోజన అయితే రూ.4లక్షల బీమా అందనుంది.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో ఈ ఏడాది 4,78,724 జాబ్‌కార్డులు మంజూరు చేయగా 1,76,88,000 పని దినాలు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో అధికంగా మహిళలు 3,07,582 మంది పనికి వస్తున్నారు. ఉపాధి వేతనదారుల్లో ఎక్కువ మంది పేదలు కావడంతో వారు ప్రైవేట్ సంస్థల్లో బీమా చేయలేని పరిస్థితి. దీంతో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వేతనదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకున్నారు. వేతనదారులు ప్రమాదవశాత్తు మృతి చెందినా, సాధారణగా మృతి చెందినా ప్రధాన మంత్రి సురక్ష యోజన, రాష్ట్రీయ స్వస్థ యోజన ద్వారా బీమా వర్తింపజేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. మే ఒకటో తేదీ నాటికి జిల్లాలో ఉన్న శ్రామికుల నుంచి బీమా దరఖాస్తులు తీసుకోవాలని కమిషనర్ కృష్ణతేజకు ఆదేశించారు. ఈ దరఖాస్తులను బ్యాంకులకు అందించి బీమా నమోదు చేయించాలని స్పష్టం చేశారు. ఈ బాధ్యతలను ఫీల్డ్‌అసిస్టెంట్లకు అప్పగించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ఏడాదికి రూ.20ప్రీమియం చెల్లిస్తేచాలు ఆ వ్యక్తి ప్రమాదంలో చనిపోయినప్పుడు రూ.2 లక్షల బీమా వర్తిస్తుంది. రాష్ట్రీయ స్వస్థ యోజన కింద రూ.450 ప్రీమియం చెల్లిస్తే ఆ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందినా, సాధారణంగా మృతి చెందినా రూ.4లక్షల వరకు బీమా అందుతుంది.


ఎంతో మేలు..



ప్రభుత్వం తీసుకువచ్చిన బీమాతో మాలాంటి పేదలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇంతవరకు నాకు బీమా లేదు. ఈ ఏడాది బీమా సదుపాయం కోసం దర ఖాస్తు చేసుకున్నాను.

-రాములు, ఉపాధి వేతనదారుడు, పెద్దపద్మాపురం, మెళియాపుట్టి

ఉపయోగపడుతుంది..



ఉపాధి వేతనదారులు ప్రమాదవశాత్తు మృతి చెందినా, సాధారణంగా మృతి చెందినా రూ.4లక్షల వరకు బీమా వర్తింప జేయడం ఆనందంగా ఉంది. మాలాంటి పేదలకు తక్కువ ప్రీమియంలో వర్తింపజేస్తున్న ఈ బీమా ఎంతో ఉపయోగపడుతుంది.

-పి.రామారావు, ఉపాధి వేతనదారుడు, పెద్దపద్మాపురం, మెళియాపుట్టి

సంతోషంగా ఉంది..



ప్రైవేట్ సంస్థలో బీమా పొందాలంటే అధిక మొత్తం ప్రీమియం చెల్లించాలి. ప్రతి ఏడాది రూ.2వేలకు తక్కువ లేకుండా కడితే రూ.4లక్షల బీమా వస్తుంది. ప్రభుత్వం మాలాంటి పేదలు ఏడాదికి రూ.450 ప్రీమియం చెల్లిస్తే రూ.4లక్షల వరకు ఇస్తుండడం చాలా సంతోషంగా ఉంది.

-ధనలక్ష్మి, ఉపాధి వేతనదారురాలు, పెద్దపద్మాపురం, మెళియాపుట్టి

దరఖాస్తులు తీసుకుంటున్నాం..



ఇంతవరకు బీమా లేని వారిని గుర్తించి వారి నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నాం. రూ.20, రూ450 రెండు రకాల ప్రీమియంలు ఉన్నాయి. శ్రామికులు ఏది కావాలో నిర్ణయం తీసుకోవాలి. దరఖాస్తులు బ్యాంకుకు అందజేస్తే వేతనాల సమయంలో ఆటోమేటిక్‌గా వారి ఖాతా నుంచి ప్రీమియం డబ్బులు కట్ అవుతాయి. దీనిని అందరూ వినియోగించుకోవాలి.

- టి.రవి, ఏపీవో, మెళియాపుట్టి

బావిలో దూకి..

- తల్లీకుమార్తె ఆత్మహత్య
- శ్రీకాకుళం మండలం గూడెంలో విషాదం
- ఇటీవల అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి
- విశాఖ ఐదో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు
- డెంకాడ నుంచి స్వగ్రామానికి వచ్చి ప్రాణాలు తీసుకున్న వైనం



వరలక్ష్మి (ఫైల్)



వరలక్ష్మి మృతదేహం



బావిలో నుంచి సావిత్రమ్మ మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

శ్రీకాకుళం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల కిందట ఓ బాలిక విశాఖ జిల్లాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. తాజాగా ఆ బాలిక అమ్మ, అమ్మమ్మ (తల్లీకుమార్తెలు) శ్రీకాకుళం మండలం గూడెంలో ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశమైంది. తల్లీకుమార్తెలిద్దరూ మెడకు చున్నీ బిగించుకుని బావిలో దూకి ఆత్మహత్య చేసుకోవడం ఆదివారం ఉదయం వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం మండలం గూడెం గ్రామానికి చెందిన మోది సావిత్రమ్మ(55), ఈమె కుమార్తె ఈదల వరలక్ష్మి(32) శనివారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. తల్లీకుమార్తెలిద్దరూ 15 ఏళ్ల కిందట గూడెంలో ఇంటిని విక్రయించి.. ఉపాధి కోసం విజయనగరం జిల్లా డెంకాడ వెళ్లిపోయారు. వరలక్ష్మికి 12ఏళ్ల కిందట శ్రీనివాస్ అనే వ్యక్తితో వివాహం కాగా.. ఈ దంపతులకు పూర్ణచంద్రిక(11) అనే కుమార్తె ఉంది. చిన్న చిన్న తగాదాల కారణంగా నాలుగేళ్ల నుంచి శ్రీనివాస్, వరలక్ష్మి వేర్వేరుగా ఉంటున్నారు. దీంతో వరలక్ష్మి తన తల్లి సావిత్రమ్మతో కలిసి డెంకాడలో చీకులు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి వద్దనే ఉంటున్న బాలిక పూర్ణచంద్రికకు ఈ నెల 24న దెయ్యం పట్టిందని.. ప్రార్థనలు చేయించేందుకు విశాఖ జిల్లా జ్ఞానాపురంలో చర్చికి సావిత్రమ్మ, వరలక్ష్మి తీసుకువెళ్లారు. అక్కడ అనుమానాస్పద స్థితిలో పూర్ణచంద్రిక మృతి చెందింది. ఈ ఘటనపై శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విశాఖ ఐదో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

● ఇదిలా ఉండగా.. డెంకాడ నుంచి సావిత్రమ్మ, వరలక్ష్మి తమ స్వస్థలమైన గూడెం గ్రామానికి శనివారం వచ్చారు. వారిద్దరూ రాత్రివేళ మెడకు చున్నీ బిగించుకుని ఓ బావిలో దూకేశారు. ఆదివారం వేకువ జామున మృతదేహాలు నీటిపై తేలుతుండటంతో విషయం బయటపడింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది వచ్చి.. మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం వాటిని శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు శ్రీకాకుళం రూరల్ పోలీసుస్టేషన్ ఎస్ఐ రాము తెలిపారు. జ్ఞానాపురంలో బాలిక అనుమానాస్పదస్థితిలో మృతిచెందడం.. ఆ తర్వాత పరిణామాలతో సావిత్రమ్మ, వరలక్ష్మి ఆందోళన చెంది.. ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తల్లీకుమార్తె మృతితో గూడెం గ్రామంలో విషాదం అలుముకుంది.



కొండపై నుంచి నడుస్తూ నీటిని తెస్తున్న దాపాకుల గూడ మహిళలు

గుక్కెడు నీటి కోసం పాట్లు

- కొండల్లో చెలమలే ఆధారం
- రెండు కిలోమీటర్లు రాకపోకలు సాగిస్తేనే..
- దాపాకుల గూడ గిరిజనులకు తప్పని ఇబ్బందులు

కొత్తూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): చుట్టూ ఎత్తయిన కొండల నడుమ జీవనం సాగిస్తున్న గిరిజనులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. గుక్కెడు నీటి కోసం సుమారు రెండు కిలోమీటర్లు నడిచివెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొత్తూరు **(మిగతా 7వ పేజీలో..)**



కొండ చెలమ వద్ద నీటిని సేకరిస్తున్న గిరిజనులు

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డా.అమూల్య

శ్రీకాకుళం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా డా.అమూల్య నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రిన్సిపాళ్లు, సర్వజన ఆసుపత్రిల సూపరింటెండెంట్‌లను మార్పు చేస్తూ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఆదివారం ఉత్తర్వులను వెల్లడించింది. ఇందులో భాగంగా... విశాఖపట్నంలో ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రొఫెసర్(ఓబీజీ) డాక్టర్ సి.అమూల్యను శ్రీకాకుళం జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. గతేడాది మే 31న శ్రీకాకుళం జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన డా.స్వామినాయుడు రిటైర్డ్ అయ్యారు. జూన్ ఒకటి నుంచి డాక్టర్ షకీలా ఎఫ్ఏసీ బాధ్యతలతో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ అమూల్య బాధ్యతలు స్వీకరించనున్నారు.

చందనోత్సవానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అరసవల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): చందనోత్సవాన్ని పురస్కరించుకుని.. ఈ నెల 30న విశాఖ జిల్లా సింహాచలం దేవస్థానానికి శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని జిల్లా ప్రజారవాణాధికారి ఏ.విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికులకు సాధారణ చార్జీలను మాత్రమే వసూలు చేస్తాం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా శ్రీకాకుళం నుంచి రణస్థలం, నాతవలస, విజయనగరం, పద్మనాభం, శొంఠ్యాం మీదుగా అడవివరం, అలాగే తగరపువలస, ఆనందపురం మీదుగా బస్సులు నడపనున్నాం. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాల'ని విజయ్‌కుమార్ సూచించారు.



నీలమణి దుర్గమ్మ

8లో

రేపటి నుంచి నీలమణిదుర్గ ఆలయ

50వ వార్షికోత్సవాలు

సాగు, తాగునీటికి కష్టాలు

- అడుగంటిన వరహాలగెడ్డ రిజర్వాయర్
- చెలమల మాదిరి చెరువులు

8 లో

శిలాఫలకానికే పరిమితం

- ప్రారంభంకాని ఆరోగ్య కేంద్రం పనులు
- పునాదుల్లోనే సచివాలయం


7 లో



గొలుసు దొంగలు

- జిల్లాలో వరుసగా చోరీలు
- ఒంటరి మహిళలే టార్గెట్
- బైక్‌పై వచ్చి బంగారు ఆభరణాలను తెంచుకొని పరారీ

➡ గత నెల 5వ తేదీ రాత్రి కొత్తూరు మండలం మదనాపురం గ్రామానికి చెందిన అగతముడి కళావతి ఇంటిలో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న తులం పుస్తెల తాడును తెంపుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.




➡ గత నెల 12న పలాస మండలం కోసంగిపురం గ్రామానికి చెందిన **దుంపల యశోద** ఆసుపత్రికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేందుకు బస్సు కోసం వేచి ఉంది. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలో ఉన్న రెండు తులాల మంగళసూత్రం, అరతు లం బంగారు శతమానం, ఆభరణాలు లాక్కుని క్షణాల్లో పరారయ్యాడు. వీటి విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని అంచనా.

➡ గత నెల 30న కంచిలి మండలం అమ్మవారిపుట్టుగకు చెందిన బొడ్డ అమ్మడమ్మ ఇంటి వెనుక గదిలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి 1.30గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి ఆమె మెడలోని సుమారు నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును తెంచుకుని పరారయ్యారు. వీటి విలువ రూ.4లక్షలు ఉంటుంది. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పలాస, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గొలుసు దొంగలు రెచ్చిపోతున్నారు. ఒంటరి మహిళలే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్నారు. దుండగులు బైక్‌లపై వచ్చి రోడ్లపై ఒంటరిగా నడిచివెళ్తున్న మహిళలను వెంబడించి వారి మెడలోని బంగారు ఆభరణాలను తెంచుకుని పరారవుతున్నారు. ఆరుబయట, ఇళ్లలో నిద్రిస్తున్న మహిళలను కూడా విడిచిపెట్టడం లేదు. జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే మహిళలు భయపడిపోతున్నారు. ఇటీవల పలాస-కాశీబుగ్గ కేటీ రోడ్డులో రద్దీగా ఉన్న మార్కెట్‌లోనే ఒంటరిగా వెళ్తున్న ఓ మహిళ మెడలోని ఆభరణాలను తెంచుకుని దుండగుడు పరారయ్యాడు. సీసీ కెమెరాలు, హైవేపై నిఘా, ప్రత్యేక సాయుధ పోలీసులు, ఇంటెలిజెన్స్‌తో పాటు నిత్యం ట్రాఫిక్ పోలీసుల పహరా ఉంటున్నా చైన్‌స్నాచర్లు రెచ్చిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఏడాది కిందట వరకూ చైన్‌స్నాచర్లు ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వరకూ ఉన్న హైవేపై గొలుసు దొంగతనాలకు పాల్పడేవారు. వీరిపై పోలీసులు నిఘా పెట్టి చాకచక్యంగా పట్టుకోవడంతో చాలావరకూ అటువంటి నేరాలు తగ్గాయి. అయితే కొందరు యువకులు జల్సాలకు అలవాటుపడి, మద్యం తాగేందుకు, ప్రేయసికి గిఫ్టులు ఇచ్చేందుకు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల కిందట పలాసలో జరిగిన బంగారు గొలుసు దొంగతనం కేసుకు సంబంధించి ఇచ్ఛాపురానికి చెందిన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూశాయి. ఆ యువకుడు చెడు వ్యసనాలకు బానిసై ఇంటిలో ఉన్న బంగారాన్ని అమ్మాడు. దాన్ని రికవరీ చేసుకోవడానికి చైన్‌స్నాచర్‌గా మారినట్లు పోలీసులకు చెప్పాడు. గ్రామాల్లో ఎక్కువగా మహిళలు ఒంటరిగానే పనులు నిర్వహిస్తుంటారు. అటువంటి వారిపై అపరిచిత వ్యక్తులు తమ ప్రతాపాన్ని చూపిస్తుంటారు. చైన్‌స్నాచర్లు ఎక్కువగా పల్సర్ బైక్‌లే వినిగిస్తున్నారు. తక్కువ వ్యవధిలో ఎక్కువ స్పీడ్ వెళ్లడానికి ఇటువంటి వాహనాలు వినియోగపడుతుండడంతో వాటిపైనే స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఎవరైనా వ్యక్తులు జెట్ స్పీడ్‌తో రోడ్డుపై వెళ్తుంటే అనుమానించాల్సిన పరిస్థితి ఉంది. కొన్ని వాహనాలకు కనీసం నెంబరు ప్లేట్లు కూడా ఉండవు. అటువంటి వాటిపై పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది. అనుమానిత వ్యక్తులు, కొత్త వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే వారిని ప్రశ్నించే తత్వం ఉంటే కొంతవరకూ దొంగతనాలు అరికట్టవచ్చు. చైన్‌స్నాచింగ్ ఘటనల నేపథ్యంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

నిఘా పెట్టాం..



అన్ని గ్రామాలతో పాటు ప్రధాన పట్టణాల్లో సీసీ కెమెరాలతో నిఘా పెట్టాం. దొంగతనం చేసిన వారు పరారీ కాకుండా చూస్తున్నాం. ప్రతి రోజూ గ్రామానికో పోలీసు విజిట్ పెట్టి ప్రజలకు దొంగతనాలపై అప్రమత్తం చేస్తున్నాం. ప్రత్యేకంగా చైన్‌స్నాచింగ్‌పై నిఘా ఉంది. అన్ని విధాలా నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-వి.వెంకట అప్పారావు, డీఎస్పీ, కాశీబుగ్గ

రామకౌండిన్యకు ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రామకౌండిన్య

శ్రీకాకుళం కల్చరల్/గార, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నృత్య దినోత్సవంలో భాగంగా హైదరాబాద్‌లోని కందుల నృత్య నికేతన్ దర్శకుడు రవి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నృత్య సమ్మేళనంలో జిల్లాకు చెందిన రామకౌండిన్య ప్రతిభా పురస్కారం అందుకున్నారు. శ్రీకాకుళం నగరానికి చెందిన నాట్య గురువు రఘు పాత్రుని శ్రీకాంత్ శిష్యుడైన రామకౌండిన్య కూచిపూడి నాట్యంతో ఆహుతులను ఆకట్టుకున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఫారెస్టు అధికారి



స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు వెంకట కృష్ణారావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. వారికి ఆలయ ఈవో భద్రాజీ స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. కాగా ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.3,48,723 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,65,100, విరాళాల ద్వారా రూ.71,553, ప్రసాదాల రూపంలో రూ.1,12,070 ఆదాయం లభించింది.

శశిధర్ ఆసుపత్రిలో క్రెడాయ్ ఎక్స్‌పో



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గుజరాతీపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గల శశిధర్ ఆసుపత్రిలో క్రెడాయ్ ఎక్స్‌పో ఆదివారం నిర్వహించారు. ఆసుపత్రిలోని డయాబెటాలజిస్టు, కన్సల్టెంట్ ఫిజిషియన్ డాక్టర్ అన్నెపు శశిధర్ నేతృత్వంలో ఈ వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో బీపీ, షుగర్, బోన్ మినరల్స్ డెన్సిటీ (బీఎండీ) స్కాన్, థైరాయిడ్, ఐబ్రెస్ట్ స్కాన్, గర్భాశయ కేన్సర్‌పై ఉచితంగా అవగాహన కల్పించారు. సమాజ ఆరోగ్యానికి, నివారణాత్మక వైద్య సేవలకు కట్టుబడి ఉంటామని డాక్టర్ శశిధర్ అన్నారు. కార్యక్రమంలో రోగులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు.

జగన్నాథరావు మాస్టారుకు అభినందన

కంచిలి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మైసూర్‌లోని దత్తపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీల్లో బంగారు పతకం సాధించిన ఉపాధ్యాయుడు మురపాల జగన్నాథరావును టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు ఆధ్వర్యంలో పెద్దశ్రీరాంపురంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మండలంలోని గొల్లపుట్టుగ గ్రామానికి చెందిన జగన్నాథరావు మాస్టారు తండ్రి మురపాల వల్లయ్య సైతం టీటీడీ ప్రచారకునిగా సేవలందించారని గుర్తు చేశారు. ఉపాధ్యాయుడిగా పిల్లల భవిష్యత్ తీర్చిదిద్దడమేకాకుండా ఆధ్యాత్మిక సేవలను అందిస్తున్న జగన్నాథరావు మాస్టారు అందరికీ ఆదర్శనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ధర్మపురం పాఠశాల హెచ్‌ఎం కె.సోమేశ్వరరావు అన్నారు. ఆదివారం ధర్మపురం గ్రామంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.ధర్మారావు, ఎస్‌ఎంసీ చైర్మన్ రోజా, గ్రామపెద్దలు పురుషోత్తం, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకానికే పరిమితం

- ప్రారంభంకాని ఆరోగ్య కేంద్రం పనులు
- పునాది దశలోనే సచివాలయం

నరుబుజ్జిలి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పాలవలస సచివాలయం పరిధిలో నిర్మిస్తున్న వైద్య ఆరోగ్య కేంద్రం శిలాఫలకానికే పరిమితమైంది. ఈ సచివాలయం పరిధిలో పాలవలస పంచాయతీ, రావివలస పంచాయతీలు ఉన్నాయి. పాలవలస గ్రామంలో నిర్మించి తల పెట్టిన గ్రామ సచివాలయ భవనం పునాదులకే పరిమితమైంది. రావివలస గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న రైతు భరోసా కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. ఇక పాలవలస పంచాయతీ పరిధిలోని పెద్ద వెంకటాపురం గ్రామంలో రూ.17.50 లక్షలతో వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం నిర్మాణం చేసేందుకు అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం 2020 అక్టోబరు 19వ తేదీన శంకుస్థాపన చేశారు. ఆనాటి నుంచి నాలుగేళ్ల పూర్తయినా శిలాఫలకం అలాగే ఉంది తప్పా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. వైసీపీ పాలనలో కేవలం శిలాఫలకాలే తప్పా ఎటువంటి నిర్మాణాలు జరగని ఎన్నో అభివృద్ధి పనులు పలు గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్నాయి. అలాగే చిగురువలస గ్రామ సచివాలయ భవన నిర్మాణం కూడా అర్థాంతరంగానే నిలిచిపోయింది. మండలంలోని గత ప్రభుత్వం ప్రకటించిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా 14 సచివాలయాలను ఏర్పాటు చేయడం జరిగింది. అయితే అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం మతలబుపేట సచివాలయం పరిధిలో ఉన్న గోనిపాడు గ్రామస్థులు పనులపై సచివాలయానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని ఆ గ్రామ ప్రజలు తెలియజేశారు. వారితో పాటు తెలికిపెంట గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న యరగాం గ్రామ ప్రజలు కూడా తమకు ప్రత్యేక గ్రామ సచివాలయం కావాలని కోరగా.. మరో రెండు గ్రామ సచివాలయాలు మంజూరు చేస్తున్నట్టు ఆయా గ్రామాల్లో అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపన చేశారు. అయితే ఆ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. భవిష్యత్తులో కూడా ఈ రెండు సచివాలయాలు ఉంటాయో లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి వేసిన శిలాఫలకం



పునాది దశలోనే నిలిచిపోయిన పాలవలస గ్రామ సచివాలయం



ఆమదాలవలస: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



జి.సిగడాం: మెట్టవలస-పాలఖండ్యాం కూడలిలో ర్యాలీగా..

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

ఆమదాలవలస, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అంతమొందించి, అమాయక ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని శ్రీనివాసాచార్యులపేట గ్రామస్థులు కోరారు. ఆదివారం సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఇటువంటి మతన్మోదాన్ని తుదముట్టించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

జి.సిగడాం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్ రాష్ట్రం పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని నిరసిస్తూ ఆదివారం పాలఖండ్యాం-మెట్టవలస కూడలి పలువురు నిరసన తెలిపారు. విద్యావేత్తలు, ప్రజా ప్రతినిధులు, యువకులు, గ్రామస్థులు ఆ దాడిలో మృతి చెందినవారికి నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పర్యాటకులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో గర్లంకి శ్రీనివాసరావు, పలిశెట్టి సూర్యనారాయణ, ఎం.ఈశ్వరరావు, పి.వేణు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనతోనే విజయం: ఎమ్మెల్యే శంకర్



నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధన దిశగా యువత కష్టపడితే విజయం వరిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్న ఈ జాబ్ మేళాలో 3,264 మంది అభ్యర్థులు హాజరుకాగా, 762 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. వీరికి ఎమ్మెల్యే గొండు శంకర్ నియామక పత్రాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కణిత శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధిసంస్థ అధికారి ఉరిటి సాయికుమార్, జిల్లా ఉపాధి అధికారిణి కె.సుధ, డీపీఆర్వో కె.బాలమాన్‌సింగ్, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దాసునాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుగు మాధవరపు వెంకటేష్, కూటమి నాయకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే పెద్దమార్కెట్ వద్ద వర్తక సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యాక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. కార్యాక్రమంలో వర్తక సంఘ అధ్యక్షుడు కోరాడ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సంఘ నాయకులు

అరసవల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు పరిష్కరించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని రిటైర్డు ఉద్యోగుల సంఘ జేఏసీ చైర్మన్ సీహెచ్ పురుషోత్తంనాయుడు అన్నారు. ఆదివారం పెన్షనర్ల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు బకాయి ఉన్న డీఏను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 70 లక్షలు మంది ఈపీఎస్ పెన్షనర్లలో సగం మంది పెన్షన్ వెయ్యిరూపాయిలు లోపే అన్నారు. కనీసం డీఏ రూ.9వేలు ఇవ్వాలని కోరారు. సంఘ నాయకులు బాపయ్యపంతులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం ఓపీఎస్ పింఛన్‌దారులకు నష్టం అని వెంటనే ఉపసంహారించాలని కోరారు. కార్యాక్రమంలో వీఎస్ఎస్ కేశవరావు, పి.సుధాకర్, ఎంఆర్ ప్రకాషరావు, కె.సోమసుందరరావు, ఎస్.భాస్కరరావు, కె.చంద్రవేఖర్, ఎం.గోవర్దనరావు, కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజనీర్ల ఖాళీలను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

అరసవల్లి, ఏప్రిల్ 27(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పంచా యతీరాజ్ ఇంజ నీరింగ్ విభాగంలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చే యాలని రాష్ట్ర స్థాయి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం స్థానిక జడ్పీ సమావేశ మంది రంలో జిల్లా అధ్యక్షుడు సనపల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వీవీ మురళీ కృష్ణంనాయుడు పాల్గొని మాట్లాడారు. 2014-19 మధ్య కాలంలో ఇంజనీర్లపై పెట్టిన కేసులు తొలగించాలని కోరారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 25వేల కిలోమీటర్ల పొడవునా రోడ్లు వేసి దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. అలాగే ఇప్పటి ప్రభుత్వ హయాంలో పల్లె పండుగ పేరుతో పెద్ద ఎత్తున రహదారులు నిర్మాణాలు సకాంలో పూర్తి చేసిన ఘనత పీఆర్ ఇంజనీర్లదేనన్నారు. దాదాపు 30 ఏళ్లగా పోస్టులు భర్తీ చేయడం లేదని, చాలీచాలని సిబ్బందితోనే పనిచేస్తున్నామని, వెంటనే ఏపీపీఎస్సీ ద్వారా ఏఈల పోస్టు లు భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.సంగీతరావు, ప్రతినిధి బి.శ్రీనివాస్‌తోపాటు 26 జిల్లాల నుంచి పలువురు హాజరయ్యారు.

టైరు పేలి.. సర్వీస్ రోడ్డుపైకి దూసుకుపోయి..



ప్రమాదానికి గురైన లారీ

లావేరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యో తి): జాతీయ రహదారి తాళ్లవలస వద్ద ఆదివారం పెను ప్రమాదం తప్పింది. వివ రాల్లోకి వెళ్తే.. టెక్కలి నుంచి విశాఖ వైపు గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీకి ముందు టైరు పేలడంతో రైన్‌గ్రేజ్ పైనుండి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డుపైకి దూసుకుపోయింది. ఆ సమయంలో సర్వీసు రోడ్డుపై ఎటువంటి వాహనాలు, ప్రయాణికుల రాకపోకులు లేకపోవడం పెను ప్రమాదం తప్పింది. దీంతో అటు వైపుగా వెళ్లే ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలా రోడ్డుకు అడ్డంగా లారీ ఆగిపోవడంతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు తగలలేదు.

గుక్కెడు నీటి కోసం పాట్లు

(ఐదో పేజీ తరువాయి)

మండలం అడ్డంగి పంచాయతీ దాపాకుల గూడ గ్రామ గిరిజనులు వేసవి వేళ.. తాగునీటి కోసం పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. కొత్తూరు మండల కేంద్రానికి మారుమూల ప్రాంతమైన దాపాకుల గూడలో 26 కుటుంబాల్లో 70 మంది జనాభా నివసిస్తున్నారు. తూర్పు భాగాన సుమారు కిలోమీటరు దూరంలో బొండూరు గూడ కొండల్లో చెలమనీరే వీరికి ఆధారం. అక్కడకు నడిచివెళ్లి.. గంటల కొలదీ నిరీక్షిస్తే బిందెడు నీరు కూడా దొరకడం కష్టమేనని గిరిజనులు వాపోతున్నారు. ఎత్తయిన కొండ ప్రాంతం కావడంతో కిందకు దిగాలన్నా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. వర్షాకాలంలో ఇబ్బందులు లేకపోయినా.. వేసవి వచ్చిందంటే తమకు తాగునీటి వెతలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండల్లో చెలమ నీటిని తెచ్చుకుని నిల్వ చేసుకుని వాడాల్సి వస్తోందని, ఈక్రమంలో కొంతమంది అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొంటున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులు, పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు తాగునీటి కష్టాలు తీర్చాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

నేడు జడ్పీలో కలెక్టర్ గ్రీవెన్స్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు వారి అర్జీల నమోదు, అలాగే నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి నేరుగా 1100 నెంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

సోంపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రామయ్యపట్నం గ్రామానికి చెందిన నాడ ధర్మరాజు బతుకు తెరువుకోసం ఏడాది కిందట చెన్నై వలస వెళ్లి మృతి చెందాడు. దీంతో అక్కడి వారు సమకూర్చిన రూ.2.50 లక్షలు అతడి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈమేరకు బోట్ యజమానులు, గ్రామ పెద్దల చేతులమీదుగా ఈ మొత్తాన్ని అందజేశారు.

30న చెవిటమ్మ తల్లి ఉత్సవం

గార, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం పంచాయతీ సిమ్మపేట గ్రామంలో ఈ నెల 30న చెవిటమ్మ తల్లి వృక్ష పూజలు నిర్వహిస్తున్నట్టు కమిటీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఇందుకు సంబంధించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 30న వృక్ష ప్రతిష్ఠ పాటు అదే రోజు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

మే డే విజయవంతం చేయాలి

గార, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మికదినోత్సవం (మే డే) విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, మండల కన్వీనర్ జల్లు కాంచన పిలుపు ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం గారలోని సీఐటీయూ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ధరలు పెరుగుదల, అవసరాలు దృష్టిలో పెట్టుకొని కనీసవ వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం పథకం, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ



ప్రశంసా పత్రాలతో విజేతలు

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): డ్రీమ్స్ ఆర్ట్స్ అకాడమీ విజయవాడ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా చిత్రలేఖన పోటీలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో బి.సన్నిత్, జస్వీర్, జ్యోతిష్యదేవి, శిశుభూషణ్ సాయిరాజ్, నవీన్, సాయి తేజస్విని, తరుణ్, చైతన్య లిపి, శ్రీవల్లి బంగారు పతకాలు సాధించారు. పునీత్ జయదేవ్ కుమార్, పవన్ అఖి వెండి పతకాలు సాధించగా, మిగిలిన వారందరికి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ అవార్డులను బాలరంజని రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణిపాత్రుని నాగేశ్వరరావు, డబ్బీరు గోవిందరావు ఆదివారం విజేతలకు అందించారు.

రారెత్తిస్తున్న ఎండలు

- అల్లాడిపోతున్న ప్రజలు, మూగజీవాలు

ఇచ్ఛాపురం/జి.సిగడాం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. గత వారం రోజులుగా అధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9గంటల నుంచే సూర్య ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఉక్కపోత, ఎండవేడిమికి వృద్ధులు, చిన్నపిల్లలు అల్లాడుతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు వడగాల్పులు తగ్గడం లేదు. ఎండ తీవ్రతకు జనసంచారం లేక రోడ్లన్నీ బోసిపోతున్నాయి. భానుడు భగభగలతో మూగ జీవాలు సైతం విలవిలాడుతున్నాయి. మేతకు వెళ్లిన పశువులు ఎండ వేడిమికి తట్టుకోలేక చెట్ల నీడ కిందకు చేరుతున్నాయి. చెరువుల్లోకి దిగి నీటిలో సేద తీరుతున్నాయి.



జి.సిగడాం: చెరువు గట్టుపై చెట్టు నీడన పశువులు



ఇచ్ఛాపురం: జనసంచారం తక్కువగా ఉన్న ప్రధాన రహదారి

అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలి

అరసవల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల కాలరాసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ వచ్చే నెల 20న చేపట్టనున్న అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకాకుళంలో సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాలకు లేబర్ కోడ్స్ మార్చివేసిందన్నారు. కేంద్రప్రభుత్వం దేశసంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతుందన్నారు. సంఘ నాయకులు కె.నాగమణి, అల్లు మహాలక్ష్మి, కె.సూరయ్య, గణపతి, రమణ, లతాదేవి, ఆర్.ప్రకాష్, ఉత్తర, ఆర్.సురేష్‌బాబు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి(ఫైల్)

రణస్థలం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి బీర్ల పరిశ్రమ సమీపంలో ఈ నెల 25వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం ఎస్‌ఐ తెలిపారు. ఆ రోజు రాత్రి రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని ఓ ద్విచక్రవాహనదారుడు ఢీ కొన్నాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మతిస్థిమితం లేక గత కొన్ని రోజులుగా ఆ వ్యక్తి ఈ ప్రాంతంలో తిరుగుతున్నట్టు విచారణలో పోలీసులు గుర్తించారు. మృతదేహం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో ఉంచామని, వివరాలు తెలిసినవారు సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

గ్రానైట్ నీటి కుండీలో పడి వ్యక్తి..


కాళీరాయ్ మృతదేహం

కోటబొమ్మాళి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పెద్ద బమ్మిడి గ్రామ సమీపం లో ఓ ప్రైవేటు గ్రానైట్ కంపెనీలో పనిచేస్తున్న అసోం రాష్ట్రం బొంగైయ్‌గోల్ జిల్లా గురునానక్ నగర్‌కు చెందిన కాళీరాయ్ (34) నీటి కుండీలో పడి మృతిచెందాడు. మృతుడు ఈ పరిసరాల్లో అనేక కంపెనీల్లో పనిచేసి మానేసి గ్రానైట్ కంపెనీలో పనిచేస్తున్నాడని కార్మికులు తెలుపుతున్నారు. రెండు రోజులుగా పనికి రాలేదని, స్వగ్రామానికి వెళ్లి ఉంటాడని భావించామని కంపెనీ యాజమాన్యం, కూలీలు తెలిపారు. నిత్యం మద్యం సేవించే అలవాటు ఉన్న రాయ్ ఆదివారం తెల్లవారుజామున కంపెనీకి చెందిన 10 అడుగుల లోతు ఉన్న నీటి కుండీలో శవమై తేలి ఉండడాన్ని గమనించిన తోటి కూలీలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఎలా మృతి చెందాడన్నది తెలియరాలేదు.

ఆటో బోల్తా: డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నరసన్నపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తామరాపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో యజ్జల వినయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. టెక్కలి మండలం తిర్లంగి నుంచి లగేజీ ఆటోతో శ్రీకాకుళం వెళుతుడగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ వినయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. నరసన్నపేట ఏఎస్‌ఐ అసిరినాయుడు ఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌లు ఢీకొని ఒకరికి..

పోలాకి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పోలాకి పంచాయతీ వెదుళ్లవలస పాతపట్నం అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం ఎదురెదురాగా వస్తున్న మోటార్ వాహనాలు ఢీకొని ఎస్.చిన్నికృష్ణ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పోలాకి నుంచి నరసన్నపేట వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం నరసన్నపేట నుంచి సునరాం వెళుతున్న చిన్ని కృష్ణ బైక్ రెండూ ఒకదానికొకటి ఢీకొనడంతో ఈ ప్రమా దం జరిగింది. వెంటనే క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. చిన్ని కృష్ణ సోదరి మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

దుకాణం మార్చే వరకూ నిరసనలు

● మద్యం అమ్మకాలను అడ్డుకున్న మహిళలు


మద్యం దుకాణంలో అమ్మకాలను అడ్డుకుంటున్న మహిళలు

పాతపట్నం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ఇక్కడి నుంచి తరలించే వారకు నిరస నలు ఆగవని స్థానిక మహిళలు స్పష్టం చేశారు. ఈ మేరకు వారుచేపడుతున్న నిరసన ఆదివారానికి నాలుగో రోజుకు చేరుకుంది. దుకాణంలో మద్యం అమ్మకాలను మహిళలు అడుకున్నారు. అనంతరం తామరలో ఎమ్మెల్యే మామిడి గోవింద రావును కలిసి వారు మాట్లాడారు. మహిళలపై ఎక్సైజ్ అధికారులు చిన్న చూపు చూస్తున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఉద్యమం చేపట్టిన వారు స్థానికులు కాదని పెయిడ్ ఆర్టిస్టులంటూ వారు వ్యాఖ్యానించి మనోభావాలను దెబ్బ తీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ- విషయాన్ని ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకువెళతానని, కొంత సమయం ఇస్తే మద్యం దుకాణం తరలించే చర్యలు చేపడతానన్నారు. అయితే దుకాణం తరలించే వరకు పోరాటం ఆగదని మహిళలు స్పష్టంచేశారు.

పేదలకు వస్త్రాల పంపిణీ


పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

హరిపురం ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): హరిపురంలో పేదలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వస్త్రాలను పంపిణీ చేశారు. దళిత వీధిలో 85 మంది నిరుపేదలకు చీరలు, లుంగీలు, పంచెలు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బైరిశెట్టి గున్నయ్య మాట్లాడుతూ.. లయన్స్ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధు లు కొర్ల కన్నారావు, వైఎస్ఎన్ మూర్తి, ఎం.లక్ష్మణరావు, జన్ని రాము, బాలకృష్ణ, రట్టి పాపారావు, పుల్లా వాసు, శేఖర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి నీలమణిదుర్గ ఆలయ 50వ వార్షికోత్సవాలు


విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా ఉన్న ఆలయం

పాతపట్నం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం నీలమణిదుర్గ ఆలయ 50వ వార్షిక నవరాత్రి ఉత్సవాలు మంగళవారం నుంచి మే 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. ఉత్స వాల నేపథ్యంలో ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. కార్యక్రమ వివరాలను ఈవో వివరించారు. మంగళవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించడంతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. విశేష హోమాలు, లలితా సహస్ర నామార్చన, ప్రతిరోజూ సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సాగు, తాగునీటికి కష్టాలు

ఎండల తీవ్రత రోజు రోజుకూ ఎక్కువవుతోంది. గ్రామాల్లోని చెరువుల్లో నీరు ఎండి పోయాయి. రిజర్వాయర్లు సైతం అడుగంటుతున్నాయి. దీంతో ఇటు ప్రజలు సాగు, తాగు నీటి కోసం అల్లాడుతున్నారు. పశువులు సైతం దాహార్తితో అలమటిస్తున్నాయి.

పలాసరూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పలాస, మెళియాపుట్టి మండలాల్లోని సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే వరహాలగెడ్డ రిజర్వాయర్ అడుగంటింది. దశాబ్దాలుగా అధికారులు, పాలకుల నిర్లక్ష్యం పుణ్యమా అని కనీస అభివృద్ధి పనులు లేకపోవడంతో రిజర్వాయర్ రూపురేఖలు మారిపోయాయి. పిచ్చి మొక్కలు, సిల్ట్ పేరుకుపోయి మైదానంలా మారి నీటి నిలువ సామర్థ్యాన్ని కోల్పోయిందని పలు గ్రామాల రైతులు అభిప్రాయపడుతున్నారు. పలాస, మందస సరిహద్దులో లొత్తూరుకు వెళ్లే మార్గంలో 1978లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.కోటికి పైగా నిధులు వెచ్చించి వరహాలగెడ్డ రిజర్వా యర్‌ను నిర్మించింది. మహేంద్రతనయ కొండల నుంచి వచ్చే నీటిని నిల్వ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. మెళియాపుట్టి, పలాస మండ లాల్లోని 2 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు రెండువైపులా మదుములు, కుడివైపు భారీ సర్‌ప్లస్ వియర్ (పరుపు) నిర్మించారు. అయితే నిర్వహణ లోపంతో కేవలం వర్షాకాలంలో తప్ప మిగిలిన రోజుల్లో కనీసం పశువులు తాగేందుకు నీరు నిల్వ ఉండని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఈ రిజర్వాయర్‌ను అభివృద్ధి చేస్తే సాగునీటికి ఇబ్బందులుండవని రైతులు కోరుతున్నారు.

చెలమల్లా చెరువులు

హరిపురం ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో 158 చిన్న తరహా చెరువులు, మరో 165 గ్రామాలకు మంచినీటి కోనేరులు ఉన్నాయి. అయితే ఆయా చెరువుల్లో నీరులేక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువులు సైతం దాహార్తితో అల్లాడుతున్నాయి. ఎండల తీవ్రతకు చెరువులు ఎండిపోయి చెలమల్లా తయారవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మందస మండలంలో సుమారు 40 గ్రామాల్లో నీటి ఎద్దడితో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. రక్షిత నీటి పథకాల ద్వారా నీటిని అందిస్తున్న బావులు ఈ చెరువుల్లోనే ఉండడంతో పథకాలకు ముప్పు ఏర్పడుతోంది. మోటారు వేస్తే గంటకూడా నీరు రాని దుస్థితి నెలకొంది. దీంతో ఆయా గ్రామాలకు నీరు అందివ్వలేని పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెరువులను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


వరహాలగెడ్డ రిజర్వాయర్ వద్ద పరిస్థితి..


చిన్న నీటి మడుగులా తయారైన బొందికారి కోనేరు

రిజర్వాయర్‌ను పటిష్టం చేయాలి

వరహాలగెడ్డ రిజర్వాయర్‌ను పటిష్టం చేసి అన్ని కాలాల్లో సాగునీరుందేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం కేవలం వర్షాకాలంలోనే నీరు ఉంటోంది. దీనివల్ల ఇతర కాలాల్లో ఇబ్బందులు ఎదురవు తున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

-ఎస్.కామేశ్, లొత్తూరు, పలాస మండలం

నీటి ట్యాంకులుగా అభివృద్ధి చేయాలి



చెరువులను మంచినీటి ట్యాంకులుగా అభివృద్ధి చేయాలి. స్థానికులకే వీటి సంరక్షణ బాధ్యత అప్పగించాలి. గతంలో గ్రామానికి ఒక్క బావి ఉన్నా నీటితో పుష్కలంగా ఉండేది. కానీ నేడు చెరువులు పూడికతో నిండి నీరులేక దయనీ యంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి చెరువులపై ప్రత్యేక దృష్టి సారించి తాగు, సాగునీటిని అందించే చర్యలు తీసుకోవాలి.

-కొర్ల కవిత, మాజీ ఎంపీపీ, మందస

ధర లేక దిగాలు

నందిగాం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలో రబీ కింద సాగు చేసిన వరికి ధర లేకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అమ్మకం కాక కల్లాల్లోనే దర్శనమిస్తోంది. గత ఏడాది రూ.2,200 పలికిన ధాన్యం బస్తా ప్రస్తుతం రూ.1,800లకు కూడా అమ్ముడు కాకపోవడంతో రైతులు మద్దతు ధర కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. నందిగాం, పెంటూరు, నరేంద్రపురం, దిమిలాడ, గొల్లూరు, పెద్దతామరాపల్లి తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల వరకు వరి సాగు చేశారు. వంశధార నీరు రాకపోయినప్పటికీ అందుబాటులో ఉన్న బోర్లు, బావులు, ఇతర వనరుల ద్వారా వ్యయ ప్రయాసలకు ఓర్చి పంట చేతికొచ్చిందన్న ఆనందం ధాన్యానికి ధర లేకపోవడంతో ఆవేదనకు గురవుతున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యానికి మద్దతు ధర కల్పించి న్యాయం చేయాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు జీరు మోహనరావు, బి.తిరుపతిరావు, రామారావు, జగదీశ్వరరావు తదితరులు కోరుతున్నారు.


నరేంద్రపురం కల్లంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

కదలని బస్తాలు.. ఆందోళనలో రైతులు

● గిట్టుబాటు ధర రాని సన్నాలు


ప్రియాగ్రహారం రోడ్డుపై ఆరబెట్టిన సన్నరకం ధాన్యం, నిల్వ చేసిన బస్తాలు

పోలాకి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగుచేసిన సన్నాలు (సాంబమసూరి) ధాన్యానికి గిట్టుబాటు ధర రాక, నిలువ చేసేందుకు అవకాశం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో 78 కేజీల బస్తా రూ.1,750 కాగా ప్రస్తుతం రూ. 1,200 దాటకపోవడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతుండడంతో అటు అమ్మలేక, ఇటు నిలువ ఉంచలేక రైతులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పండించిన పంటను రోడ్లపై ఉంచా ల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అనేక కష్ట నష్టాలు ఓర్చుకుని పండించిన పంట విక్రయం కాకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నా మని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో సుమారు 40 శాతం రైతులు 700 క్వింటాళ్ల సన్నధాన్యం దిట్టుబాటు ధర లేక మిగి లిపోయాయని పలువురు రైతులు చెబుతున్నారు. ఇదే విషయమై ఏవోకు వివరించినా ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి గిట్టుబాటులో చేర్చలేదని ఆయన తెలిపారని, దీంతో తాము పండించిన పంటను ఏం చేసుకోవాలని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను రక్షించుకునేందుకు అదనపు భారం పడుతోందని వాపోతున్నారు. క్షేత్రస్థాయికి అధికారులు వచ్చినప్పుడు సమస్యలను తెలిపినా ప్రయోజనం ఉండడం లేదని పలు గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. ప్రియాగ్రహారం, బెలమర, సునరాం, చెల్లాయివలస, అంబీరుపేట తదితర గ్రామాల రోడ్లపై సన్నరకం ధాన్యం ఆరబోసిన వైనం చూస్తున్న బాటసారులకు రైతుల కష్టాలు తీవ్ర వేదనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సన్న రకం ధాన్యం కొను గోలు చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

హిందూధర్మం గొప్పదనంపై ప్రచారం చేయాలి

కోటబొమ్మాళి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): హిందూధర్మం గొప్పదనంపై విస్తృతంగా ప్రచారం చేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు లోకనాధం ఆనంద్ అన్నారు. ఆదివారం కొత్తపేట శివకేశవ ఆలయంలో వీహెచ్‌పీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వురు స్వామీజీలు, హిందూ ధర్మం వివరించే సభ్యులకు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యోగా చంద్రశేఖర్, బండి రాములమ్మ, జనార్దన్ స్వామి, ఎండ శ్యాము, కంబాల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు


కాలిపై కుక్కగాట్లు

టెక్కలి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ ఆదీఆంధ్రా వీధికి చెందిన కె.తన్విక్ సాయి అనే ఐదేళ్ల బాలుడిపై ఆదివారం సాయంత్రం వీధికుక్కలు దాడిచేసి గాయపరిచాయి. ఇంటిబయట ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా వీధి కుక్కలు దాడిచేసి గాయపరచడంతో వెంటనే ఆ బాలుడిని చికిత్స నిమి త్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. టెక్కలిలో వీధికుక్కలు బెడద అధికంగా ఉందని, పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు

జాతీయ లోక్‌అదాలత్ వాయిదా

పలాస, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మే 10వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను జూలై 5వ తేదీకి వాయిదా వేసినట్లు పలాస మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి యు.మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. కక్షిదారులు, పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది ఈ మార్పును గుర్తించాలని, రాజీ పడదగ్గ కేసులను పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు.

భూసార పరీక్షలతో మేలు

పలాసరూరల్‌ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో మేలు చేకూరుతుందని, దీనిని రైతులు వినియోగించు కోవాలని వ్యవసాయాధికారి సుశీల కోరారు. జగన్నాథ సాగరం ఆయకట్టు ప్రాంతంలోని భూముల్లో ఆదివారం మట్టి నమూనాలు సేకరించారు. మట్టి నమూనా పరీక్షల అనంతరం ఫలితాలను తెలియజే స్తామని, ఆ తరువాత సూచనల మేరకు భూసారం పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పవర్ బోర్‌కు శంకుస్థాపన

పలాస, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక 26వ వార్డు గొల్లవీధిలో పవర్ బోర్ నిర్మాణానికి ఆదివారం కౌన్సిలర్ టి.ఆశా రాణి శంకుస్థాపన చేశారు. వార్డులో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న కారణంగా ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు పవర్‌బోర్ మంజూరు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రామారావు, టి.హరిశంకర్, ఎం.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాగిరి అమ్మవారి జాతరకు ఏర్పాట్లు

పోలాకి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): దీర్ఘాశిలో వెలసిన దుర్గాగిరి అమ్మవారి జాతర కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పల్లి రాజు భవానీ తెలిపారు. మే నెల 2, 3, 4 తేదీల్లో భారీ ఎత్తున జరగనున్న జాతర కోసం ఆలయ ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నా మన్నారు. ఆలయానికి వెళ్లేందుకు సీసీ రహదారిని ప్రభుత్వం నిర్మించిందన్నారు. భక్తుల కోసం తాగునీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లే

కొత్తూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. ఒడిశా వెళ్లేందుకు భారీ వాహనాలు సైతం ఈ మార్గంలోనే వెళుతుంటాయి. బస్సులు, ఇతర భారీ వాహనాలు గంటల తరబడి రోడ్లపైనే నిలిపివేస్తుండడంతో ఇతర వాహనాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కళాశాల మార్గంలో స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ప్రైవేటు బస్సులు, మరోపక్క ఆటోలు నిలుపుదల చేస్తుండడంతో ఇతర పెద్ద వాహనాలు పక్క నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో వాహనాలు నిత్యం నిలిచిపోయి వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. సాయంత్రం ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని పలువురు వాహన చోదకులు పేర్కొంటున్నారు. బత్తిలి మార్గంలో రోడ్డు పక్కనే వాహనాలు నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. నాలుగు రోడ్ల కూడలిలో ఆయా మార్గాల్లో వాహనాలు సైతం రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పోలీసులు చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎస్‌ఐ అమీర్ ఆలీ వద్ద ప్రస్తావించగా ఈ మార్గంలో రోడ్లను ఆక్రమించి దుకాణాల ముందు వారి వస్తువులు పెట్టడం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందని, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు.


నాలుగు రోడ్ల కూడలిలో నిలిచిన వాహనాలు

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు


చీపిలో నిర్మాణాలను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

హరిపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని కేంద్ర బృందం సభ్యుడు (న్యూఢిల్లీ) ఎంఓఆర్డీ పీవో కిరణ్ పాడి అన్నారు. మందస మండలంలో మూడేళ్లలో చేపట్టిన ఉపాధి హామీ పనులను బృంద సభ్యులు ఆదివారం తనిఖీ చేశారు. సిమెంటుతో చేపట్టిన పలు నిర్మాణాలతోపాటు చెరువులు, నీటి కుంటలను పరిశీలించారు. మందసలో మూడు సీసీ రోడ్లు, మూడు చెరువులు, ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించారు. అనంతరం సాబకోట, చీపిలో బీటీ రోడ్లు, జిల్లుండలో సీసీ, బీటీ రోడ్డు, బేతాళ పురంలో బీటీ రోడ్డుతోపాటు పాంపాండ్‌ను పరిశీలించారు. సిమెంటు నిర్మాణాల్లో నాణ్యత లోపంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల తవ్వ కాలను రైతులకు, పంటలకు ఉపయోగ పడేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యు లు ఎంవోఆర్డీ టెక్నికల్ అధికారి అజయ్ ప్రతాప్ సింగ్, డ్వామా పీడీ బి.సుధాకర రావు, ఏపీడీ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో రమేష్ నాయుడు, ఏపీవో హరికృష్ణ పాల్గొన్నారు.

కుమార్‌నాయక్‌కు సత్కారం



పలాసరూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల కందుకూరి విశిష్ఠ అవార్డు పొందిన కళాకారులు కుమార్‌నాయక్‌ను ఆదివారం మాకన్నపల్లిలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక సభ్యులు సత్కరించారు. రానున్న కాలంలో జానపద కళల అభ్యున్నతికి మరింతగా పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కళావేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు, ఉపాధ్యక్షుడు డి.రామారావు, ప్రచార కార్యదర్శి కుత్తుమ వినోద్, పి.రాజేంద్ర, తెప్పల అప్పారావు పాల్గొన్నారు.

భావనపాడు తీరాన్ని సందర్శించిన జేసీ


తాబేళ్ల పిల్లలను విడిచిపెడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సంతబొమ్మాళి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): భావనపాడు సముద్ర తీరాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. తీరంలో అటవీశాఖ, ట్రీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రంలో పెంచుతున్న 420 తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టారు. కార్యక్రమంలో అటవీశాఖాధికారి నరేంద్ర, బీట్ ఆఫీసర్ జయలక్ష్మి, ట్రీ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ సోమేశ్వరరావు, సర్పంచ్ బుడ్డా మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

జలుమూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వ పాఠ శాలల్లో చేర్పించాలని హెచ్‌ఎం దుర్గాబాయి కోరారు. అచ్యుతాపురంలో ఆదివారం ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, ఉచిత యూనిఫారం, పాఠ్యపుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందిస్తోందన్నారు. క్రమశిక్షణతో కూడిన గుణాత్మక విద్య అందిస్తామని, సమీపంలోని ప్రభుత్వం పాఠశాలల్లో పిల్లలను చేర్పాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటినుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

జలుమూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాదికారి ఢిల్లేశ్వరి తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకను వెలికితీసేందుకు జూన్ 6వ తేదీ వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటలు వరకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నామ సంకీర్తన

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బైపల్లి సత్యసాయి మందిరంలో ఆదివారం నామ సంకీర్తన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 23వ పర్తి యాత్రలో భాగంగా ప్రపంచ శాంతి కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు కన్వీనర్ తెప్పల సాయిరాం తెలిపారు. కార్యక్రమంలో పలువురు సత్యసాయి సేవకులు పాల్గొన్నారు.

ఐటీడీఏ లేకపోవడానికి వైసీపీయే కారణం

మెళియాపుట్టి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐటీడీఏ లేకపోవడం వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనికి వైసీపీ ప్రభుత్వమే కారణమని టీడీపీ గిరిజన గిరిజన కమిటీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బైరిశింగి దినకర్‌రావు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. కొందరు వైసీపీ నాయకులు ఐటీడీఏ కావాలని ఇప్పుడు డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అసెంబ్లీలో ప్రస్తావించినందునే మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జిల్లాల విభజన సమయంలో గిరిజనుల అభిప్రాయాలు తీసుకోలేదన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అందరి అభిప్రాయాలు సేకరించి ఐటీడీఏని ప్రకటిం చిందన్నారు. వైసీపీ హయాంలో ట్రైకార్, సబ్ ప్లాన్ నిధులను సైతం దారి మళ్లించి దోపిడీ చేశారని ఆరోపించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ చిన్నింటి గౌరమ్మ, నారాయణరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.